సాక్షి నల్లగొండ

సోమవారం, 16 డిసెంబర్, 2024



గడువు పెంచాలి

ఏకసభ్య విచారణ కమిషన్‌కు మరో ఆరునెలలు గడువు పెంచాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు హసేన్ కోరారు. - 8లో



వైభవంగా గరుడవాహన సేవ

మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం రాత్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఆలయ తిరుమాడ వీధుల్లో గరుడ వాహనంపై ఊరేగించారు. - 10లో



'చేనేత'పై అధ్యయనం

ఎంజీయూ విద్యార్థులు ఆదివారం భూదాన్ పోచంపల్లిలో చేనేత కార్మికుల స్థితిగతులపై అధ్యయనం చేశారు. - 10లో

న్యూస్‌రీల్

చెర్వుగట్టులో మాస కల్యాణం

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ఆలయంలో మాస కల్యాణాన్ని వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో దేవాలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సురేశ్‌శర్మ, సతీష్‌శర్మ, ఈఓ నవీన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..



మాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మండలంలోని గోపాలయపల్లి గ్రామ సమీపాన గల శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం మాస కల్యాణాన్ని దేవాలయ అర్చకులు వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. పూజ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, రాజేశ్వరిదేవి, దేవేందర్, రామకృష్ణారెడ్డి, రాములు, వెంకటేశం, వెంకటచారి ఉన్నారు.

21న న్యాయ విద్యార్థుల సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఐలు రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

చౌటుప్పల్ : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 21వ తేదీన న్యాయ విద్యార్థుల సదస్సు నిర్వహించనున్నట్లు చౌటుప్పల్ బార్ కౌన్సిల్ సభ్యుడు, ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు–పౌరసమాజం–రాజ్యాంగం అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగానికి ఎదురైన సవాళ్లు, వాటి పట్ల న్యాయ విద్యార్థుల పాత్రపై సదస్సులో చర్చ ఉంటుందన్నారు. న్యాయ విద్యార్థులు చదువుతోపాటు సమాజంపై అవగాహన పెంచుకుని వృత్తిలో నైపుణ్యం సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి, తడక మోహన్, కమిటీ సభ్యులు జెల్ల రమేష్, ఎండీ ఖయ్యూంపాష తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం చేపట్టారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను భక్తుల మధ్య ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆగిన అభివృద్ధి..!

- మిర్యాలగూడలో రూ.57కోట్ల పనులకు కలగని మోక్షం
- గత ప్రభుత్వంలోనే విడుదలైన నిధులు
- రాజకీయ విభేదాలతో పనులు నిలిపివేసినట్లు గుసగుసలు
- అస్తవ్యస్తంగా తయారైన గ్రేడ్–1 మున్సిపాలిటీ



మిర్యాలగూడలోని తడకమళ్ల రోడ్డు

పనులను త్వరలో ప్రారంభిస్తాం

మిర్యాలగూడ మున్సిపాలిటీకి టీయూఐఎఫ్‌డీసీ పథకం కింద నిధులు మంజూరైన మాట వాస్తవమే. దీనికిగాను ఇప్పటికే టెండర్లు, అగ్రిమెంట్లు పూర్తి చేసాం. త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– వెంకన్న, మున్సిపల్ డీఈ

మిర్యాలగూడ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో కొంతకాలంగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పట్టణంలో రూ.57 కోట్ల చేపట్టాల్సిన పనులకు మోక్షం కలగడం లేదు. గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరైనా పనులు చేపట్టేందుకు వెనుకాడుతున్నారు. ప్రభుత్వం మారడంతోపాటు స్థానిక పాలకవర్గం కూడా పార్టీ ఫిరాయింపులు చేయడంతో అభివృద్ధి పనులు ఎప్పుడు జరుగుతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. రాజకీయ వివాదాల కారణంగా పనులు నిలిచిపోయినట్లు పట్టణవాసులు చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులకు నిధులు నిలిచిపోవడం, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పనులు సైతం నడవకపోవడంతో పట్టణంలో అభివృద్ధి కుంటుపడింది. దీంతో గ్రేడ్–1గా ఉన్న మున్సిపాలిటీ అస్తవ్యస్తంగా మారింది.

రూ.57 కోట్లు టీయూఐఎఫ్‌డీసీ నిధులు మంజూరు..

గత ప్రభుత్వంలో మిర్యాలగూడ పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు తెలంగాణ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఐఎఫ్‌డీసీ) పథకం కింద రూ.57 కోట్ల రుణం మంజూరైంది. పట్టణంలో డ్రెయినేజీ, రోడ్లు నిర్మించడంతోపాటు సెంట్రల్ లైటింగ్, అన్ని వార్డుల్లో రోడ్ల సౌకర్యం కల్పించేందుకు ఈ నిధులు ఖర్చు చేయాలి. తొలుత మంజూరైన రూ.41 కోట్లతో 9కి.మీ డ్రెయినేజీ, 6కి.మీ రోడ్డు, రాజీవ్‌చౌక్ నుంచి హనుమాన్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు సెంటర్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. అదేవిధంగా అన్ని వార్డుల్లో రోడ్లు వేయాలి. రెండవ విడతలో మంజూరైన రూ.16 కోట్లతో తడకమళ్ల జంక్షన్ నుంచి 2కి.మీ వరకు బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. రోడ్డు వైడలింగ్‌తోపాటు సైడ్ వెంట డ్రైనేజీ, రోడ్డు మధ్యలో డివైడర్లు, సైంటర్ లైటింగ్ ఏర్పాటు చేయాలి.

సంవత్సరం దాటినా..

టీయూఐఎఫ్‌డీసీ పథకం కింద రెండు విడతల్లో రూ.57 కోట్లు గత ప్రభుత్వంలోనే మంజూరయ్యాయి. ఈ మొత్తాన్ని రుణం ద్వారా మంజూరు చేయగా పనులు చేపట్టిన తరువాత మున్సిపాలిటీకి వచ్చిన ఆదాయం ద్వారా తిరిగి చెల్లించాలి. ఈ పథకం కింద పనులు చేపట్టేందుకు టెండర్లు, అగ్రిమెంట్ పూర్తి చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఎస్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండర్లు దక్కించుకుంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులను ప్రారంభించలేదు.

రాజకీయ వివాదాలతోనేనా..!

కొత్త ప్రభుత్వం రావడంతోపాటు స్థానికంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ సమయంలో మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ పార్టీకి మెజారిటీ కౌన్సిలర్లు ఉన్నారు. ఆ తర్వాత చాలా మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ కోణంలోనే రాజకీయ వివాదాల వచ్చాయి. ఆ కారణంగా పనులు ప్రారంభించలేదని తెలుస్తోంది. మరో నెల రోజుల్లో మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగియనున్నడంతో ఆ తరువాత పనులు చేపట్టాలని ఓ ప్రజాప్రతినిధి హుకుం జారీ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ పనులను ప్రారంభిస్తే అన్ని వార్డుల ప్రజాప్రతినిధులకు కమీషన్లు ఇవ్వాల్సి వస్తుందని, మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగిస్తే తమకు కలిసి వస్తుందనే భావనలో ఉన్నట్లు సమాచారం.

గ్రూప్–2కు సగం మందే హాజరు



నల్లగొండలోని ఎన్జీ కళాశాల కేంద్రం వద్ద బారులుదీరిన అభ్యర్థులు

- మొదటిరోజు ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు
- పరీక్ష కేంద్రాలు తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

నల్లగొండ : గ్రూప్–2 పరీక్షలు తొలిరోజు ఆదివారం ప్రశాంతంగా సాగాయి. నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాలలో ఏర్పాటు చేసిన 87 కేంద్రాల్లో గ్రూప్–2 పరీక్షలకు సగం మందే హాజరయ్యారు. పరీక్షలకు మొత్తం 29,118 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, ఉదయం పరీక్షకు 14,676 మంది హాజరయ్యారు. ఉండగా.. 14,442 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 14,540 మంది హాజరుకాగా, 14,578 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని రామగిరి మహిళ డిగ్రీ కళాశాల, కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాల్లో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. ఆ పరీక్ష కేంద్రానికి కేటాయించిన అభ్యర్థులు, హాజరైన, గైర్హాజరైన వారి వివరాలను చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్–2 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా సాగుతున్నాయని తెలిపారు. పరీక్షల సందర్భంగా పోలీసు, రెవెన్యూ, తదితర శాఖల అధికారులకు కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.



మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎస్పీ తనిఖీ

నల్లగొండ క్రైం : గ్రూప్–2 పరీక్ష కేంద్రాలను ఎస్పీశరత్ చంద్ర పవార్ ఆదివారం పరిశీలించారు. నల్లగొండ పట్టణంలోని కోమటిరెడ్డి ప్రతీక్ జూనియర్ కళాశాల కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. నల్లగొండ, మిర్యాలగూడలో పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు చేసినట్లు తెలిపారు.



నల్లగొండలోని బాలికల జూనియర్ కళాశాల కేంద్రంలో హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది



పరీక్ష కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

హైవే పక్కన రసాయన వ్యర్థాలు



రసాయన వ్యర్థాలు పారబోయడంతో మాడిపోయిన మొక్కలు



బోరు నుంచి నురగలుగా వస్తున్న నీరు

చింతపల్లి : మండల పరిధిలోని దేవులతండా సమీపంలో హైదరాబాద్ – నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై గుర్తుతెలియని వ్యక్తులు రసాయన ఫ్యాక్టరీ వ్యర్థాలను పారబోస్తున్నారు. రహదారి పక్కనే ట్యాంకర్ల ద్వారా కెమికల్స్‌ను తీసుకొచ్చి పోస్తుండడంతో పా పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పాటు భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. సమీపంలో రైతు బోరుబావుల నుంచి కలుషిత నీరు వస్తోంది. రెండు రోజుల క్రితం ఓ బోరు నుంచి వచ్చిన నీటిని తాగిన మహిళ వాంతులు విరోచనాతో ఆసుపత్రి పాలైంది. అధికారులు స్పందించి రసాయన వ్యర్థాలను రోడ్డు వెంట పారబోయకుండా చూడాలని తండావాసులు కోరుతున్నారు.

కార్మికుల సంక్షేమానికి పాటుపడాలి

సూర్యాపేట: కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటంరాజు అన్నారు. ఆది వారం సూర్యాపేటలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ఆ సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 25లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు వెల్ఫేర్ బోర్డులో పేర్లు నమోదు చేసుకుంటే సుమారు 15లక్షల మంది వరకు రెన్యూవల్ చేయకపోవడం దారుణమన్నారు. వెల్ఫేర్ బోర్డులో కోట్ల రూపాయలున్నా కార్మికుల కోసం ఖర్చు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. ప్రమాదంలో మరణించిన కార్మికునికి ప్రస్తుతం ఇస్తున్న రూ.6లక్షలను రూ.10లక్షలకు పెంచాలని, దాన సంస్కారాలు, కాన్పులు, వివాహ కానుకలకు ఇచ్చే రూ.30వేలను రూ.లక్షకు పెంచాలన్నారు. సహజ మరణానికి ఇచ్చే రూ.లక్ష నుంచి రూ.5లక్షలకు పెంచాలని, 60 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికునికి రూ.5వేలు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం కార్మికులకు అడ్డాలు ఏర్పాటు చేసి అడ్డాలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్యగౌడ్, ఉపాధ్యక్షులు పల్లపు తిరుమలేష్, బాలాజీనాయక్, వల్లెపు శ్రీనివాస్, లింగయ్య, రావులపెంట వెంకయ్య, గంట వెంకన్న, ఒగ్గు సైదులు, బుచ్చిబాబు, వీరబాబు, గణేష్, నెహ్రూ, వెంకటేశ్వర్లు, నాగుల్‌మీరా, వెంకన్న, సైదులు, పరుశరాములు, పార్వతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మాలలను రెచ్చగొడుతున్న సీఎం

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నకిరేకల్: సీఎం రేవంత్‌రెడ్డి రెండు నాలుకల ధోరణితో మాలలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతూ మాదిగలు, మాలల మధ్య దూరం పెంచుతున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. ఆదివారం నకిరేకల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయాలన్నారు. మంగళవారం జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణపై తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు 30 ఏళ్లుగా పోరాడుతున్నారని గుర్తుచేశారు. కులగణన ఆధారంగా మాదిగలకు వాటా ఇవ్వాలన్నదే తమ డిమాండ్ అని పేర్కొన్నారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ హయాంలో దళిత శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, దళిత సంఘాలు వర్గీకరణ కోసం ఢిల్లీ వరకు కొట్లాడారని గుర్తుచేశారు. మాల, మాదిగలు ఒకరినొకరు నిందించుకునే విధంగా ఉండొద్దని.. అందరూ కలిసి ఉండాలని కేసీఆర్ కోరుకుంటున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు కూడా న్యాయబద్ధమైన తీర్పు ఇచ్చిందన్నారు. ఆ తీర్పును ప్రభుత్వం అమలు చేయాలన్నారు. వర్గీకరణ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ నేడు.. రేపు అనే విధంగా కమిటీలు, స్టేట్మెంట్లతో కాంగ్రెస్ నాయకులు హడావుడి చేస్తున్నారు తప్ప చేసింది ఏమీ లేదన్నారు. దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే వర్గీకరణ అమలు చేస్తామని ఆ తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామని మాయమాటలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి పాత రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాడని మండిపడ్డారు.

నేటి నుంచి సీఎం కప్ క్రీడాపోటీలు

నల్లగొండ టూటౌన్ : సీఎం కప్–2024 జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు జరుగనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 16, 18 విభాగాల్లో క్రీడా పోటీలు ఉంటాయని, జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని పేర్కొన్నారు. మండల, మున్సిపాలిటీ స్థాయిలో జరిగిన పోటీల్లో గెలుపొందిన వారు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని, పోటీలకు వారు మాత్రమే హాజరు కావాలని సూచించారు.



నల్లగొండలో క్రీడల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

క్రీడలు జరిగే ప్రాంతాలు, తేదీల వారీగా..

- 16న కబడ్డీ పోటీలు అవుట్‌డోర్ స్టేడియం నల్లగొండ.
- 16న బేస్‌బాల్ పోటీలు ఎస్ఎస్‌పీ క్యాంపు, మిర్యాలగూడ.
- 17న ఖోఖో, బ్యాడ్మింటన్, జూడో పోటీలు మేకల అభినవ్ స్టేడియం, ఇండోర్ స్టేడియం నల్లగొండ.
- 18న వాలీబాల్, ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్ పోటీలు అవుట్‌డోర్ స్టేడియం, ఇండోర్ స్టేడియం నల్లగొండ.
- 19న అథ్లెటిక్, హ్యాండ్‌బాల్, తైక్వాండో (ఉమ్మడి జిల్లా స్థాయి) పోటీలు అవుట్‌డోర్, ఇండోర్ స్టేడియం నల్లగొండ
- 20న హాకీ, నెట్‌బాల్, బాస్కెట్‌బాల్, చెస్, యోగా అవుట్‌డోర్ స్టేడియం, ఎన్జీ కాలేజీ, ఇండోర్ స్టేడియం నల్లగొండ.
- 21న హాకీ, వాలీబాల్, హ్యాండ్ బాల్ (ఉమ్మడి జిల్లా)పోటీలు అవుట్‌డోర్ స్టేడియం నల్లగొండ.
- 21న వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు ఇండోర్ స్టేడియం నల్లగొండ.

నీలగిరిపై విజిలెన్స్ నజర్

- మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల రికార్డులు స్వాధీనం
- నవంబర్ నుంచి మున్సిపల్, ఆర్‌అండ్‌బీ విభాగాల్లో తనిఖీలు
- ఇంజనీరింగ్ విభాగం అధికారుల్లో మొదలైన వణుకు



మున్సిపల్ కార్యాలయం

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నయనే ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు నజర్ పెట్టారు. పట్టణంలో ప్రధాన రహదారులతో విస్తరణతో పాటు, జంక్షన్‌ల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్, క్రీడా ప్రాంగణాలు వంటి అభివృద్ధి పనుల్లో అవినీతి చోటు చేసుకుందని, మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడ్డారని ఓ వ్యక్తి 2022లో హైదరాబాద్‌లోని విజిలెన్స్ కార్యాలయంలో ఐజీకి రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదు ఆధారంగానే గత నెల మొదటి వారంలో మున్సిపాలిటీ కార్యాలయం నుంచి అభివృద్ధి పనులకు సంబంధించిన అన్ని ఒరిజినల్ రికార్డులను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రికార్డుల ఆధారంగా వివరాల సేకరణ..

నవంబర్ 20వ తేదీ నుంచి స్థానిక విజిలెన్స్ అధికారులు.. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి నీలగిరి పట్టణంలోని ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, రోడ్ల వెడల్పు ఎన్ని మీటర్లు, ఎంత విస్తరించారు.. నాణ్యత ప్రమాణాలు పాటించారా అనే కోణంలో రికార్డుల ఆధారంగా వివరాలు సేకరించిలో పనిపడ్డారు. పట్టణంలోని ఎన్ని పార్కులు అభివృద్ధి చేశారు.. వాటిలో కల్పించిన మౌలిక సదుపాయాలు, గ్రీనరీ, వివిధ వార్డుల్లో పెట్టిన క్రీడా ప్రాంగణాలు ఎలా ఉన్నాయి.. వాటిలో క్రీడా సామగ్రి ఎక్కడ ఉంది.. లాంటి సమగ్ర సమాచారం తీసుకుంటున్నట్లు తెలిసింది. వీటితో పాటు ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రైతు బజార్, చర్లపల్లిలోని నిర్మించిన పార్కుకు ఖర్చు చేసిన నిధులపై ఆరా తీస్తున్నారు.

టెండర్ల ప్రక్రియ నుంచి నాణ్యత వరకు..

పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో టెండర్ల ప్రక్రియ నుంచి, టెండర్లలో ఏఏ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.. కాంట్రాక్టర్లు ఎక్కడి వారు.. వారు చేసిన పనులు నిబంధనల ప్రకారమే చేశారా.. వారికి బిల్లులు ఎప్పుడు ఇచ్చారు.. ఎస్టిమేట్ రూపొందించిన ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగుల వివరాలు సైతం తీసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. పనుల ఎస్టిమేట్ దగ్గరి నుంచి టెండర్ల ప్రక్రియ, చేసిన పనుల ప్రకారం నిధులు మంజూరు చేశారా లేక అధనంగా బిల్లులు ఇచ్చారా.. పనుల్లో నాణ్యత పాటించిన వివరాలు, నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ ఏజెన్సీ వారు ఇచ్చిన సర్టిఫైడ్ పత్రం, ప్రక్రియ అంతా నిబంధనల ప్రకారం చేశారా.. లేక నిబంధనలను పక్కకు పెట్టేశారా అని లోతుగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అయితే, ఫిర్యాదు అంది రెండేళ్లు దాటిన తరువాత విజిలెన్స్ అధికారులు విచారణ చేయడం అనుమానాలకు తావిస్తుందనే చర్చ కూడా సాగుతోంది.

ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగుల్లో దడ..

నీలగిరి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ఎక్కువ శాతం పనులు ఇంజనీరింగ్ విభాగంకు సంబంధించినవే. ప్రస్తుతం విజిలెన్స్ విచారణ సాగుతుండడంతో అప్పట్లో ఇష్టానుసారంగా వ్యవహరించిన కొందరు ఏఈలు, డీఈలకు వణుకు మొదలైందనే చర్చ జరుగుతుంది. చేయి తడపగానే చేసిందంతా చేసేసిన కొందరు.. ఇప్పుడు తమకు ఏం తెలియదని, అంతా పైవారిపైనే నెట్టేసే ప్రయత్నం చేస్తున్నట్లు వినికిడి. అయితే.. విజిలెన్స్ అధికారులు విచారణ పూర్తి చేస్తారా లేక గతంలో మాదిరిగా మధ్యలోనే వదిలేస్తారో వేచి చూడాలి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌ను సంప్రదించగా రికార్డులు విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నది వాస్తవమే అని ధ్రువీకరించారు.

- కళ్లకు గంతలతో నిరసన



సమగ్రశిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా ఆదివారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నల్లగొండ

క్లుప్తంగా

ట్రాక్టర్లలోని బ్యాటరీలు చోరీ

నకిరేకల్: మండలంలోని చందుపట్ల గ్రామంలో ఆరు ట్రాక్టర్లలోని బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీ చేశారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుపట్ల గ్రామానికి చెందిన రైతులు గోనె నర్సింహరావు, అయిటిపాముల సత్యనారాయణ, నిమ్మల సైదులు, బుచ్చాల సైదులు, సంద్ర భీమయ్య, గొడ్డేటి శివ శనివారం తమ తమ వ్యవసాయ పొలాల్లో తమ ట్రాక్టర్లతో పనులు చేసి ట్రాక్టర్లను అక్కడే వదిలి ఇళ్లకు వెళ్లిపోయారు. రాత్రివేళ గుర్తుతెలియని వ్యక్తులు ఆరుగురి ట్రాక్టర్లలోని బ్యాటరీలను చోరీ చేశారు. ఆదివారం ఉదయం బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించిన బాధిత రైతులు నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


సత్తయ్య (ఫైల్)

ఆలేరు రూరల్: పాము కాటుతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు గ్రామానికి చెందిన బండి సత్తయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే ఆదివారం తన వ్యవసాయ బావి దగ్గర వరి కుప్పలు తీస్తుండగా అతడిని పాము కాటేసింది. చుట్టుపక్కల వారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జనగామలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో కాపరి, మేకలు మృతి

నకిరేకల్: విద్యుదాఘాతంతో మేకల కాపరితో పాటు రెండు మేకలు మృతిచెందాయి. ఈ ఘటన నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. మంగళపల్లి గ్రామానికి చెందిన జాల చినమల్లయ్య(60) రోజుమాదిరిగానే ఆదివారం కూడా తన మేకలను మేపేందుకు గ్రామ శివారులోకి తోలుకెళ్లాడు. గ్రామ శివారులో గల కాటమయ్య గుడి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు రెండు మేకలు వెళ్లాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంప ఉండటంతో మేకలు అందులో ఇరుక్కపోయాయి. చినమల్లయ్య వాటిని చేతితో లాగే ప్రయత్నం చేయగా.. అప్పటికే రెండు మేకలకు విద్యుత్ షాక్ తగిలి కొట్టుమిట్టాడుతున్నాయి. వాటిని పట్టుకున్న చినమల్లయ్యకు కూడా విద్యుత్ షాక్ తగలడంతో రెండు మేకలతో పాటు అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కూమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు కోటిలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చినమల్లయ్య మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించి అతడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోదాడరూరల్: అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని కోదాడ పట్టణ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని లక్ష్మీపురం కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు, నరసింహారావు ఇళ్లలో అక్రమంగా నిల్వ చేసిన 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. వారి ని అదుపులోకి తీసుకొని విచారించగా.. లక్ష్మీపురానికి చెందిన రేషన్ డీలర్ కోటేశ్వరరావు అమ్మినట్లు తెలిపారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రాంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీలర్ కోటేశ్వరరావుతో పాటు వెంకటేశ్వర్లు, నరసింహారావుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

● పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షలు


భువనగిరిలోని జాగృతి కళాశాల వద్ద దివ్యాంగురాలిని వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న ఎస్ఐ, పోలీస్ సిబ్బంది


నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీలో గ్రూప్-2 అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


కోమటిరెడ్డి ప్రతీక్ జూనియర్ కాలేజీ వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు


సూర్యాపేట ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ సెంటర్‌కు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థిని ఆపివేసిన సిబ్బంది


కోదాడ పట్టణంలోని ఓ పరీక్షా కేంద్రం వద్దకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి


మిర్యాలగూడ బస్టాండ్ వద్ద అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల అడ్రస్ చెబుతున్న డీవైఎఫ్ఐ నాయకులు


నల్లగొండ పట్టణంలో పరీక్షకు వెళ్తూ చిన్నారికి ముద్దు పెడుతున్న తల్లి

టీపీఎఫ్ యాదాద్రి జిల్లా కమిటీ ఎన్నిక


టీపీఎఫ్ నూతన కమిటీ సభ్యులు

భువనగిరిటౌన్: తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కమిటీని భువనగిరిలో జరుగుతున్న ద్వితీయ మహాసభల్లో ఆదివారం రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కాశపాక మహేష్, ఉపాధ్యక్షుడిగా కావాలి యాదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాసాల నర్సింహ, కార్యదర్శిగా రాసాల బాలస్వామి, సమన్వయకర్తగా బట్టు రామచంద్రయ్య ఎన్నికయ్యారు. ఈ సభలో తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య, టీపీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు రాపోలు పవన్ కుమార్, గుండెబోయిన బాలకృష్ణ, చిక్కుల కరుణాకర్, ఏనుగు మల్లారెడ్డి, గోపె మహేష్ పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న రిటైర్డ్ హెచ్‌ఎంలు

నకిరేకల్: నకిరేకల్ ప్రాంత రిటైర్డ్ హెచ్‌ఎంల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నకిరేకల్ పట్టణంలోని లక్ష్మీనారాయణరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి నకిరేకల్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని రిటైర్డ్ అయిన డీఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు సూమారు 80 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఉద్యోగం చేసిన రోజులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఈఓ ముస్కు క్రిష్టారెడ్డి, కందుల సోమయ్య, చిక్కు చంద్రమౌళి, వీరమల్ల రవీందర్, వంటల రామలింగం, కందాల పాపిరెడ్డి, గుత్తా భిక్షంరెడ్డి, పోతుల రామచంద్రయ్య, పి. ఉత్తరమ్మ, పోతుల మల్లయ్య, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాలు.. 102 మంది

నార్కట్‌పల్లి: మండలంలోని అమ్మనబోలు గ్రామ పంచాయతీ పరిధిలోని పెరుమాండ్లబావి గ్రామానికి చెందిన ఏనుగుల అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి కుటుంబాలకు చెందిన 102మంది ఆదివారం గ్రామంలో ఒకే చోటుకు చేరుకుని ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. కుటుంబ సభ్యులందరూ కలిసి రూ.8లక్షలతో గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం, గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ఆత్మీయ సమ్మేళనంలో చర్చించుకున్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో ఏనుగుల అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులు

సైబర్ నేరగాళ్ల టోకరా

భువనగిరి: సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తికి ఫోన్ చేసి టోకరా పెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన అకౌంట్ నుంచి ఫోన్ పే ద్వారా తనకు తెలిసిన వ్యక్తికి రూ.24వేలు పంపాడు. అతడు పంపిన వ్యక్తికి డబ్బులు వెళ్లకపోవడంతో గూగుల్‌లో వెతికి ఫేక్ కస్టమర్ కేర్ నంబర్‌కు కాల్ చేసి విషయం చెప్పాడు. అవతలి వ్యక్తి చెప్పిన విధంగా చేయడంతో మరో రూ.25వేలు కూడా అకౌంట్ నుంచి పోగొట్టున్నాడు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

బస్టాండ్‌లో అనారోగ్యంతో వ్యక్తి మృతి

భువనగిరిటౌన్: భువనగిరి బస్టాండ్‌లో అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన పారునంది రమేష్(50) ఆదివారం భువనగిరి బస్టాండ్‌లోని గజ్వేల్ ప్లాట్‌ఫాం వద్ద కుర్చీలోనే మృతిచెందారు. ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతుడి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. మృతుడి స్వస్థలం వరంగల్ కాగా ప్రస్తుతం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని మేడిపల్లిలో నివాసముంటున్నాడని, రమేష్ మద్యానికి బానిసై గత రెండేళ్లుగా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడని, అనారోగ్యంతోనే తన భర్త మృతిచెందినట్లు మృతుడి భార్య ధనలక్ష్మి తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


వెంకన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన నకిరేకల్ మండలం చందంపల్లి శివారులో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం చెర్వన్నారం గ్రామానికి చెందిన శిరస్సు వెంకన్న(51) కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వెంకన్న పని నిమిత్తం ఆదివారం ఉదయం బైక్‌పై నకిరేకల్‌కు వచ్చాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. నకిరేకల్ మండలం చందంపల్లి శివారులో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై కారు అతి వేగంతో వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకన్నకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య పూలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు. మృతదేహానికి నకిరేకల్ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆస్పత్రిలోల వెంకన్న మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించి అతడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గోవుకు అంత్యక్రియలు


అంతిమయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

కేతేపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతిచెందిన గోవుకు గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన కేతేపల్లి మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. కేతేపల్లిలోని శంభులింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ సమయంలో 16 ఏళ్ల క్రితం భక్తులు ఒక గోవును ఆలయానికి బహూకరించారు. నాలుగు రోజుల క్రితం స్థానిక చర్చి సమీపంలో ఆ గోవు విజయవాడ-హైదరాబాద్ హైవే దాటుతుండగా బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. గ్రామస్తులు పశు వైద్యులను పిలిపించి గోవుకు చికిత్స చేయించారు. పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం గోవు మృతి చెందింది. మృతి చెందిన గోవును శివుని ప్రతిరూపంగా భావించిన గ్రామస్తులు శివాలయ కమిటీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. గోవు కళేబరాన్ని ట్రాక్టర్‌పై ఉంచి డప్పుచప్పుళ్లతో, బాణసంచా కాలుస్తూ గ్రామ వీధుల్లో ఊరేగించారు. హిందూ సాంప్రదాయం ప్రకారం గోవును ఖననం చేశారు. కార్యక్రమంలో శివాలయ కమిటీ చైర్మన్ అలుగుబెల్లి కేశవరెడ్డి, గ్రామస్తులు అలుగుబెల్లి జోగిరెడ్డి, ఎ. మహేందర్‌రెడ్డి, చందా శ్రీనివాస్, చందా సైదులు, ఎ. వెంకట్‌గౌడ్, ఎ. వీరాచారి, ఎం. పున్నయ్యగౌడ్, ఎ. యాదగిరిరెడ్డి, మహేష్, డి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఫీడర్ చానల్‌ను అభివృద్ధి చేయిస్తా


కొంపల్లి ఫీడర్ చానల్‌ను పరిశీలిస్తున్న వెదిర మేఘారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

మునుగోడు: మండలంలోని కొంపల్లి ఫీడర్ చానల్‌ని అభివృద్ధి చేయిస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, సీఎం రేవంత్‌రెడ్డి బావమర్ది వెదిర మేఘారెడ్డి అన్నారు. ఆదివారం కొంపల్లి గ్రామ రైతులతో కలసి పుట్టపాక గ్రామ శివారు నుంచి దాదాపు 4 కిలోమీటర్ల మేర పూడిపోయిన ఫీడర్ చానల్‌ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం సాగునీటి వనరులని అభివృద్ధి చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఫీడర్ ఛానల్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానన్నారు. మునుగోడు మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేసేలా కృషిచేస్తానన్నారు. ఇందుకు మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తగిన సహాయ, సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ వెదిర విజయేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు జాల వెంకన్న యాదవ్, బోయపర్తి లింగయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పార్వతీలింగయ్య, జీడిమడ్ల మల్లయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు నిహారిక, సంధ్య

బొమ్మలరామారం : భువనగిరి జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో మండలంలోని మర్యాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పగిడిపల్లి నిర్మల జ్యోతి ఆదివారం తెలిపారు. అండర్ 16 బాలికల విభాగంలో రెండు కిలో మీటర్ల పరుగుపందెంలో 9వ తరగతికి చెందిన విద్యార్థినులు డి. నిహారిక ప్రథమ స్థానంలో , డి. సంధ్య తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ నెల 22న నాగర్‌కర్నూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈఓ రోజారాణి, టీచర్లు శ్రీకాంత్, స్వరూప రాణి, సిద్దులు, రాజు, ముఖిద్, రవీశ్వర్, సుజాత, శ్రీధర్, నాగజ్యోతి, శ్రీదేవి అభినందించారు.

కారును ఢీకొట్టిన లారీ.. డ్రైవర్ మృతి

బీబీనగర్: కారును లారీ ఢీకొనడంతో కారు డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన బీబీనగర్ మండలం కొండమడుగు మెట్టు సమీపంలో వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మేడిపల్లిలోని వినాయక్‌నగర్‌కు చెందిన షేక్ అవైస్(24) తన ఇన్నోవా క్రిస్టా కారులో ఆదివారం జనగామ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో బీబీనగర్ మండలం కొండమడుగు మెట్టు సమీపంలోని జైన్ ఇరిగేషన్ పరిశ్రమ వద్దకు రాగానే వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన లారీ ఇన్నోవా కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా.. అవైస్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తండ్రి వాజిద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు


సమావేశంలో పాల్గొన్న మున్నూరు కాపు సంఘం నాయకులు

హుజూర్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మున్నూరు కాపుల మద్దతు ఉంటుందని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోల నాగేశ్వరరావు, శాసనాల నాగ సైదయ్య, కామిశెట్టి వెంకటేశ్వర్లు ప్రకటించారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన ఆ సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మద్దతు ఇచ్చిన విధంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి మున్నూరు కాపు సంఘం పూర్తి మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. మున్నూరు కాపులు రాజ్యాధికారం సాధించేందుకు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. త్వరలో నియోజకవర్గ స్థాయిలో మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మేళనానికి మంత్రి ఉత్తమ్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి దంపతులను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు కాసర్ల నాగేశ్వరరావు, ఆవుల వెంకటయ్య, కడియం శ్రీనివాసు, కాల్వ లక్ష్మయ్య, కాల్వ పెద్ద వెంకటేశ్వరరావు, కాలవ చిన్న వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మరో ఆరునెలలు గడువు పెంచాలి


మాలల మహాగర్జన సభకు వెళ్తున్న నాయకులు

సూర్యాపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కోసం నియమించిన ఏకసభ్య విచారణ కమిషన్‌కు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పూర్తి సమాచారం రాలేదని, మరో ఆరునెలలు గడువు పెంచాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తళ్లమల్ల హసేన్ కోరారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో జరిగిన మాలల మహాగర్జన బహిరంగ సభకు వెళ్తూ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామర్ల జానయ్యతో కలిసి ఆయన సూర్యాపేటలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ 15 రోజుల్లోనే చేస్తామని ప్రకటించడం తొందరపాటు చర్యని అన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన సూచనలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆర్టికల్ 341ను సవరించి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చట్టం చేయుటకు మన రాష్ట్ర ప్రభుత్వం తరపున తీర్మాణం చేసి పంపాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నామ లింగయ్య, న్యాయవాది ఏడిండ్ల అశోక్, కంచర దాసు ఆనందరావు, ఇట్టమల్ల భిక్షం పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ పద్ధతితో అధిక దిగుబడులు

పాడిపంట


డ్రమ్‌సీడర్ లాగుతున్న రైతు

నడిగూడెం: రబీ సాగు పనులను రైతులు ప్రారంభించారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు నారు పెంచి, కూలీలతో నాట్లు పెట్టిస్తుంటారు. దీంతో సమయం, పెట్టుబడి కూడా పెరుగుతుంది. కావున రైతులు వరి విత్తనాన్ని డ్రమ్‌సీడర్ పద్ధతిలో నేరుగా విత్తుకుంటే, కూలీల సమస్యను అధిగమించి, పెట్టుబడులు తగ్గి, అధిక దిగుబడిని సాధించవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ చెబుతున్నారు.

నేలలు : సమస్యాత్మక నేలలు (చౌడు లేదా క్షారము లేదా ఆమ్లము) తప్ప సాధారణంగా వరిని సాగు చేసే అన్ని నేలలు అనుకూలం. ముంపునకు గురయ్యే భూములు అనుకూలం కాదు.

విత్తన మోతాదు : వరి రకాన్ని బట్టి ఎకరానికి 10–15 కిలోలు అవసరమవుతాయి. కాండం గట్టిగా ఉండి వేరు వ్యవస్థ ధృడంగా ఉండి, పడిపోని రకాలు అనుకూలం. ఆయా ప్రాంతానికి అనువైన, రైతుకు ఇష్టమైన ఏ రకమైనా ఈ పద్ధతిలో సాగు చేసుకోవచ్చు.

ప్రధాన పొలం తయారీ : సాధారణ పద్ధతిలో వరి నాటేటప్పుడు భూమిని తయారు చేసినట్లుగానే ఈ పద్ధతిలో కూడా తయారుచేయాలి. పొలంలో నీరు నిల్వ ఉండకూడదు. నీరు ఎక్కువైతే బయటకు పోవడానికి ఏర్పాట్లు చేయాలి. వీలైనంత బాగా చదును చేసుకోవాలి. పెద్దగా ఉన్న పొలాలను చిన్న మడులుగా విభజించుకుంటే చదును చేయడానికి, నీరు పెట్టడానికి, విత్తనం విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. విత్తే సమయానికి నీరు లేకుండా బురదగా ఉంటే చాలు. ఇసుక శాతం ఎక్కువ ఉన్న నేలలో విత్తాలనుకున్న రోజే ఆఖరి దమ్ము చేసి, మండె కట్టి మొలక వచ్చిన విత్తనాలను విత్తుకోవాలి.

విత్తడానికి అవసరమయ్యే కూలీలు : ఈ పద్ధతిలో ఒక ఎకరం విత్తడానికి ఇద్దరు కూలీలు అవసరమవుతారు. డ్రమ్‌సీడర్ లాగడానికి ఒక మనిషి, గింజలు నింపడానికి ఇంకొక మనిషి అవసరమవుతారు.

విత్తే విధానం : లీటరు నీటికి గ్రాము చొప్పున కార్బండాజిమ్ కలిపిన ద్రావణంలో విత్తనాలు 12 గంటలు నానబెట్టి 24 గంటలు మండెకట్టి, కొద్దిగా కొమ్ము పగిలిన గింజలను డ్రమ్‌సీడర్ ద్వారా విత్తుకోవచ్చు. నారుమడిలో నీటి యాజమాన్యం ఏవిధంగా చేస్తామో వరి మొదటి దశలలో అదేవిధమైన పద్ధతిని అవలంబించాలి. డ్రమ్‌సీడర్ పరికరానికి 4 ప్లాస్టిక్ డ్రమ్ములుంటాయి. ప్రతి డ్రమ్ముకు 20 సెం.మీ. దూరంలో రెండు చివర్ల వరుసకు 18 రంధ్రాలు ఉంటాయి. ఈ డ్రమ్ములో మొలకెత్తిన విత్తనాలను నింపి మూత బిగించాలి. గింజలు రాలడానికి వీలుగా ప్రతి డ్రమ్ములో మూడో వంతు మాత్రమే గింజలు నింపాలి. గింజలను నింపిన డ్రమ్‌సీడర్ లాగితే 8 వరుసలలో వరుసకు వరుసకు మధ్య 20 సెం.మీ. దూరంలో గింజలు పడతాయి. వరుసల్లో కుదురు కుదురుకు మధ్య దూరం 5–8 సెం.మీ. ఉంటుంది. ఒక్కో కుదురులో 5–6 గింజలు రాలడం జరుగుతుంది. కొన్ని అనివార్య కారణాల వలన (మొలక సరిగ్గా లేకనో పక్షులు తినివేయడం వల్ల) కుదురులోని గింజలు 50 శాతం దెబ్బతిన్నా మిగిలిన 50 శాతం గింజల నుండి వచ్చిన మొక్కల సాంద్రత సరిపోతుంది. రకాన్ని బట్టి గింజలు రాలడాన్ని బట్టి రంధ్రాలను మూసుకోవాలి. సన్న గింజ రకాలకు రంధ్రం వదిలి రంధ్రం మరొక రంధ్రం మూసేయాలి. ప్రతి 16 వరుసలకు అడుగు వెడల్పు కాలి బాటలు ఉంచుకోవాలి. తాడు వాడి డ్రమ్ లాగితే వరుసలు బాగా వస్తాయి. కోనోవీడర్ తిప్పడానికి వీలుగా ఉంటుంది.

కలుపు నివారణ : విత్తిన మూడో రోజున పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 80 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా బెంథియోకార్బ్ 1.25 లీటర్లు లేదా బుటాక్లోర్+సేఫెనర్ 1.25 ఎకరానికి 20 కిలోల ఇసుకలో కలిపి విత్తిన 8–10 రోజులలోపు పొలంలో పలుచని నీరుంచి చల్లుకోవాలి. దమ్ము చేసిన పొలంలో మండె కట్టిన విత్తనాన్ని పొలమంతా సమంగా పల్చటి నీటి పొర నుండి వెదజల్లాలి.

పంట దిగుబడి : సాధారణ సాగు కన్నా ఈ పద్ధతిలో పంట దిగుబడి అదనంగా వస్తుంది. సాళ్లలో కోనోవీడర్ ద్వారా కలుపు తీస్తే, ఈ కలుపు పంటకు పచ్చిరొట్ట ఎరువు అవుతుంది. పిలకలు, దుబ్బులు అధికంగా వస్తాయి. విత్తిన తర్వాత పంట కాలంలో రెండు నుండి మూడు సార్లు కోనోవీడర్ తప్పితే అధిక పంట దిగుబడి వస్తుంది.